17వ సంవత్సరం
సూర్య
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,19 ఫిబ్రవరి 2024


## సర్వేలో ముద్దరబోయిన పేరెత్తని చంద్రబాబు



**చాట్రాయి,మేజర్‌న్యూస్ :** 'నేను మీ చంద్రబాబు నాయుడుని. మీ నియోజకవర్గంలో అభ్యర్థిగా పోటీ చేయడానికి ఎవరు పనికి వస్తారు ? కొలుసు పార్థసారథి అయితే ఒకటి నొక్కండి.నోటా అయితే రెండు నొక్కండి' అంటూ సర్వేలో చంద్రబాబు గొంతుతోనే కార్యకర్తలకు ఫోన్లు రావడం ముద్దరబోయిన పేరు ఎత్తకపోవడం చర్చనీయాంశం అయింది. నూజివీడు నియోజకవర్గంలో తెదేపా వ్యవస్థ పరంగా పార్టీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో తిలోదకాలు ఇచ్చి ముఠా తగాదాలు తారస్థాయికి చేరుకున్న సందర్భంలో చంద్రబాబును కలిసి వచ్చిన తర్వాత అభ్యర్థి మార్పుపై గడచిన పదేళ్లుగా తెదేపా నూజివీడు నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆత్మీయ సభలో కంట తడి పెట్టుకోవడం ఐవిఆర్ఎస్ సర్వేలో చంద్రబాబు గొంతుతో పార్టీ కోసం పదేళ్ళు పనిచేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పేరు సైతం లేకుండా ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పేరు ఒక్కటి మాత్రమే అడగటం చర్చనీయాంశంగా మారింది.

## బిషప్ జయరావును అభినందించిన బడేటి చంటి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** స్థానికబిషప్‌హౌస్‌నందుఏలూరు పీఠాధిపతులు బిషప్‌పొలిమేర జయరావుకివిశాఖపట్నం పీఠాధిపతులుగా అదనపు బాధ్యతలు తీసుకున్న సందర్భంగా టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట ఏలూరు జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జుంజు మోసెస్,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

### 20న పవన్ కళ్యాణ్ భీమవరం

# పర్యటన



**జనసేను టిడిపి నేతలతో భేటీ .. భవిష్యత్తు ఎన్నికల ప్రణాళికపై సమీక్ష**

**ఏలూరు,సూర్య బ్యూరో:** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పర్యటన ఖరారైంది. గత వారమే రావలసి ఉండగా ఆర్ అండ్ బి అధికారులు హెలికాప్టర్ దిగడానికి సాంకేతిక కారణాలు చూపారని వచ్చిన వార్తల నేపథ్యంలో ఆయనపర్యటన వాయిదా పడింది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్న పవన్ కళ్యాణ్ సోమవారం సాయంత్రం రాజమండ్రిలోపార్టీ నేతలతోసమావేశం అవుతారు. మంగళవారం భీమవరం చేరుకుంటారు.కాగాఈ పర్యటనలో ఆయన మరోసారి భీమవరంలో పోటీ చేసేది, లేనిది అనే అంశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీతో పొత్తులు వ్యవహారం ఒక కొలిక్కి వచ్చినందువల్ల పార్టీ నేతలకు ఆయన ఎవరు ఎక్కడ నుండి పోటీ చేసేది వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

అధికారికంగా చంద్రబాబు పవన్ కళ్యాణ్ సీట్లు ప్రకటించే అవకాశాలు ఉన్నప్పటికీ భీమవరం పర్యటనలో జనసేన నేతలకు ఆయన వచ్చే ఎన్నికల ప్రణాళికపై దిశా నిర్దేశం చేయనున్నారు. అదేవిధంగా తెలుగుదేశంపార్టీనాయకులతోకూడా మాట్లాడబోతున్నారు. రెండు పార్టీల మధ్య సమన్వయం కోసం పవన్ కళ్యాణ్ పర్యటన దోహదపడనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# దేశ వ్యాప్త సమగ్ర కుల గణన జరపాలి

**బి.సిలకు చట్ట సభలలో వాటా సాధన కోసం పోరాటం**
**జాతీయ బి.సి. ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు,**






**భీమవరం,మేజర్‌న్యూస్:** భారత దేశంలో బి.సి కులాల జనాభా లెక్కలు లేకపోవుట వలన దేశంలో 60 శాతం అనగా సగ భాగం పైనే ఉన్న బి.సి కులాల ప్రజలు తీవ్రంగా నష్టపోవుచున్నారని సామాజికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో బి.సి రంగాల వారు తీవ్ర ఇబ్బందులు పడుచున్నారని జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వరరావుపేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా జనాభాలో అత్యధిక శాతం ఉన్న బి.సి కులాల జనగణన జరుగకపోవుట వలన బి.సి. ప్రజలు మన దేశ స్వాతంత్ర్య ఫలాలు అనుభవించుట లేదనిఅన్నారు.

ఆదివారం భీమవరం రాజుల కళ్యాణ మండపంలోఆల్ బీసీ సంక్షేమ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్‌బిసిసంక్షేమసంఘం నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జాతీయ ఉపాధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్ పట్టణ అధ్యక్షుడు కొమ్మోజు కన్నబాబు డాక్టర్ శ్రీను, మహిళా విభాగం విజయ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి పలువురు వక్తలు మాట్లాడుతూదేశంలో బి.సి. లకు ఒకన్యాయం, ఇతర వర్గాలకు ఒకన్యాయం జరుచుతున్నది. ప్రస్తుత 75 సంవత్సరాలుగా పాలన సాగిస్తున్న పాలకులు బి.సి కులగణన చేయకుండా కుట్రలు చేయుచున్నారు.

బ్రిటీషు ఇండియా పాలనలో 6 సార్లు 1881 నుండి 1930 వరకు దేశంలో ఉన్న 6500 పైగా ఉన్న కులాలకు కుల ఆధారిత జనగణన ద్వారా లెక్కలు చేసారుఅని కానీ భారత దేశంలో స్వదేశీ పాలన అమలులోకి వచ్చిన తరువాత బి.సి కులగణన చేయకుండా కుట్రలు చేస్తున్నారు అని 2011లో యు.పి.ఏ ప్రభుత్వ హయాంలో సోషియా ఎకనమిక్ కాస్ట్ బేస్డ్ సెన్సెస్ జనాభా లెక్కలు చేసినా వాటిని బయట పెట్టలేదు. 2018లో సాక్షాత్తు అప్పటి కేంద్ర హెూం మంత్రి రాజనాథ్ సింగ్ 2021లో జరుగబోయే జనగణనలో బి.సి కులాల లెక్కలు చేస్తామని ప్రకటించారు అని అన్నారు. అందువలనే బి.జె.పి పార్టీ 2019 ఎన్నికలలో 300 పైచిలుకు యం.పి స్థానాలు బి.సి ప్రజలు కట్టబెట్టారు. నరేంద్ర మోది బి.సి. కులాలలో య.బి.సి కులాల వ్యక్తి కావడం వలన ఆయన దేశానికి ప్రధాన మంత్రి అయితే బి.సి.ల కష్టాలు తీరుతాయని దేశంలో ఉన్న 80 కోట్ల బి.సి ప్రజలు భావించారు అని అన్నారు .

కానీ వారి ఆశలు అడియాశలు అయ్యాయి అని ఎన్నో సార్లు భారత దేశ అత్యునత న్యాయస్థానం సుప్రీం కోర్టు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు బి.సి లకు పెంచాలి అని కేసులు వేసినప్పుడు కులాల జనాభా లెక్కలు ఉంటే రిజర్వేషన్లు జనాభా దామాషా ప్రకారం పెంచవచ్చు అని పలుమార్లు వెల్లడించింది అని కేంద్రంలో బి.సి మంత్రిత్వ శాఖ లేకపోవడం బి.సి కులాల వారంతాఅది అవమానంగా భావిస్తావున్నారు. బి.సి లకు చట్ట సభలలో రిజర్వేషన్లు కల్పించాలని బి.సిల డిమాండ్లు నెరవేరాలంటే ఉద్యమం ఒక్కటే మార్గమని అన్నారు. జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడకల శ్రీదేవి,, ఎస్ కల్పన, రజిని, చిట్టూరి దర్గా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు. జిల్లాల మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ క్షీరామాన్ని దర్శించుకున్న సబ్ కలెక్టర్ అంబరీష్



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** పంచారామ క్షేత్రాలలో ఒకటైన శ్రీ క్షీరరామలింగేశ్వర స్వామిని ఆదివారంనరసాపురంసబ్‌కలెక్టర్ అంబరీష్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక అభిషేకాలను చేయించారు, ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డ్ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్య నిర్వాహణాధికారిఏళ్ళసూర్యనారాయణ,ఆలయసిబ్బంది పాల్గొన్నారు,

## బిషప్ జయరావుకు శుభాకాంక్షలు



**ఏలూరు, మేజర్‌న్యూస్:** ఏలూరు పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ శ్రీ శ్రీ శ్రీ బిషప్ పొలిమేర జయ రావు కి విశాఖ పట్నం ఆర్చ్ బిషప్ అడ్మినిస్ట్రేటివ్‌గా అరుదైన గౌరవం దక్కిన సందర్భంగా నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బిషప్ పొలిమేర జయ రావుకు రోమ్ నుంచి పోప్ ద్వారా ఏలూరు పీఠాధిపతి తో పాటు అదనపు బాధ్యతలు అప్పచెప్పినందుకు హర్షం వ్యక్తం చేశారు.

## బూరుగుగూడెంలో తండ్రి పేరిట వృద్ధాశ్రమం

**-ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య**




**చాట్రాయి,మేజర్‌న్యూస్ :** మనిషిలో సంతోషమే సగం బలం నింపుతుందని ఆనందం ఆయుష్‌ని పెంచుతుందని వయోభారం పైబడిన వారికి మానసిక ఉల్లాసము చాలా అవసరమని నూజివీడు మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య తెలిపారు. ఆదివారం చాట్రాయి మండలం బూరుగు గూడెం గ్రామంలో చిన్నం రామకోటయ్య తండ్రి కీర్తిశేషులు చిన్నం సుబ్బారావు పేరు మీద వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ పాత్రికేయులు నెల్లూరు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలమాన పరిస్థితుల నేపథ్యంలో వయోభారం పైబడిన తల్లిదండ్రుల పట్ల కొంత నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. చాట్రాయి మండల పరిధిలో గల 18 గ్రామ పంచాయతీల పరిధిలో కుల,మతాలకు అతీతంగా వయోభారం పైబడిన వారు ఎవరైనా ఆశ్రమం నియమ నిబంధనలకు లోబడి ఇక్కడ ఉండవచ్చున్నారు. కార్యక్రమంలో చాట్రాయి మాజీ సర్పంచ్ జోషి చాట్రాయి వర్తక సంఘం నాయకులు గోళ్ళ మోహన్ రావు,వీసం నరసింహారావు, సీనియర్ నాయకులు రతి కంటి రామచంద్రరావు, చీపురుగూడెం మాజీ ఎంపీటీసీ మేకల చందు, కొమ్ము సృజన రావు, నరసింహారావుపాలెం మాజీ ఎంపిటిసి సుబ్బారెడ్డి,చనుబండ నాయకులు ములగలపాటి శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు చాట్రాతి రమాకాంత్ బెనర్జీ, చంద్ర శేఖర్ రెడ్డి, కారంగుల చిన్నబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కోడి పందాల శిబిరంపై దాడి : 8మందిపై కేసు

**టి.నరసాపురం,మేజర్‌న్యూస్ :** కోడి పందాలు ఆడుతున్న 8మంది వ్యక్తుల పై కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వర రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బండివారిగూడెం గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం తన సిబ్బందితో దాడి చేసి నిర్వాహకుల నుంచి 1200 రూపాయల నగదు ఒక కోడిపుంజు,ఒక కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

## వైసిపి పట్టణ,మండల సమన్వయకర్తల నియామకం



**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** వైసిపి కొయ్యల గూడెం పట్టణ, మండల శాఖల సమన్వయకర్తలుగా ఆరుగురు సభ్యులను నియమించినట్లు ఎమ్మెల్యే తెల్లంబాలరాజు తెలిపారు . కమిటీలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గా దాసరి విష్ణు,ఎంపీపీ గంజిమల రామారావు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, ముప్పిడి వెంకట్రావులను నియమించినట్లు తెలిపారు.

ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా పార్టీ విస్తృత కార్యక్రమాల నిర్వహణతో పాటుగా 18 పంచాయతీల పరిధిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవలసిన బాధ్యత వీరిపై ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# ఏలూరు అభివృద్ధి బిజెపితోనే సాధ్యం

**గారపాటి చౌదరికి ఓటు వేసి మద్దతుగా నిలవాలి**
**ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్**





**పెదవేగి,మేజర్‌న్యూస్:** ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా బిజెపి నేత గారపాటి చౌదరిని గెలిపించుకుంటే డబుల్ ఇంజన్ అభివృద్ధి సాధ్యమవుతుందని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. జబర్దస్త్ టీమ్, సినీ గాయకులతో కూడిన బృందం ఆదివారం పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి తరుపున ప్రచారం నిర్వహించి సందడి చేసింది. అంకన్నగూడెం, రాట్నాలకుంట, పెదవేగి, ఏలూరులోని చొదిమెళ్ళలో పర్యటించి ప్రధాని మోడీ చేస్తున్న అభివృద్ధి గురించి, తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి నిస్వార్థంగా గత 16 సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. జబర్దస్త్ కళాకారులు అదిరే అభి,అప్పారావు,బాబీ,వినోద్(వినోదిని), ఇమ్మాన్యుయేల్‌లు కామెడీ షోతో అలరించారు. సినీ గాయని గాయకులు అరుణ్ కౌండిన్య, వినుత్న పాడిన పాటలు స్థానికులల్లో ఉత్సాహం నింపాయి. ప్రధాని మోడీ భారతదేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచ దేశాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని బిజెపి అభ్యర్థి గెలుపుతోనే ఏలూరు అభివృద్ధి సాధ్యమని ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. మోడీ పాలన,తపన చౌదరి సేవలు పైన పలు ప్రశ్నలు స్థానికులను అడిగి సమాధానం చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు ఉండవల్లి వెంకటరావు, నియోజకవర్గ కోకన్వీనర్ పెనుబోయిన రమేష్, కొత్త మధుసూదన్,పంచకర్ల రఘు, రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

# గృహాల పేరుతో పేదలపై అప్పుల భారం మోపిన జగన్

**1,2 వార్డుల్లో ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల ఇంటింటి పాదయాత్ర**



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** సీఎం జగన్ టిడ్కో గృహాల పేరుతో పేదలకు బ్యాంకు రుణం పేరుతో రూ 10 లక్షల అప్పు భారం మోపాడని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఆయన పట్టణ 1,2 వార్డుల్లో ఆదివారం మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు,ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ జగన్‌నిలబెట్టుకోవాలని వైసిపి ప్రభుత్వ ఐదేళ్లలో టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేయలేదని. గత టిడిపి ప్రభుత్వ హయాంలోటిడ్కో గృహాలు 90 శాతం పూర్తికాగా వైసీపీ ప్రభుత్వంలో మిగిలిన 10 శాతం పనులు జరగలేదన్నారు. గృహాలను అప్పగించకుండానే లబ్ధిదారుల పేరిట బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి ప్రభుత్వం రూ కోట్ల సొమ్ము తన ఖాతాలోకి మళ్లించుకుందన్నారుటిడ్కో గృహాలు చివరి లబ్ధిదారునికి అందే వరకు చేపట్టిన నా పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. చిన్నపాటి వర్షంకురిసిన10 వార్డుల ముంపుకు సంబంధించిన దమయపర్తి మురుగుడ్రైన్ ను 2014 టిడిపి ప్రభుత్వంలో రూ.7.50 కోట్లు మంజూరు చేయించి రెండు కోట్ల పనులు పూర్తి చేయగా వైసీపీ ప్రభుత్వంలో ఐదు రూపాయలు పని నోచుకోలేదని విమర్శించారు. రెండు నెలల్లో రాబోయేటిడిపి జనసేన ప్రభుత్వంలో మురుగు డ్రైన్ ప్రక్షాళన పనులు పూర్తి చేసి వార్డుల్లో ముంపు సమస్య లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.పేదల కష్టాల్లో తోడుగా ఉండి సేవకులుగా పనిచేసే నన్ను ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే రామానాయుడు ప్రజల కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, పాలకొల్లు నియోజకవర్గం జనసేన ఇన్చార్జ్ సిద్ది రెడ్డి అప్పారావు, నాయకులు, లక్ష్మణ్,రియా,పెచ్చేట్టి బాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ వల్లభు నారాయణమూర్తి , వల్లభు శ్రీనివాస్,వార్డు ప్రెసిడెంట్ మీసాల నారాయణ,ఇజ్జాడ రాంపండు, కర్నేన గౌరునాయిడు,అవినాష్,కొల్లు పవన్,మహేష్,మునసబు,జానీ,మీసాలరాము,పకీర్‌బాబు,అల్లం తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ ప్రభుత్వానికి

# కౌంట్ డౌన్ ప్రారంభం

**-టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి బడేటి చంటి**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** వైసిపి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభం అయిందని టిడిపిఏలూరునియోజకవర్గ ఇన్చార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. స్థానిక పవర్ పేట బడేటి క్యాంపు కార్యాలయం నందు 33వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కరణం లోకేష్(బన్నీ) ఆధ్వర్యంలోటిడిపి నాయకులు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలకు బటన్ నొక్కుతున్నానని ఆర్భాటపు ప్రగల్భాలు పలుకుతున్నారని ,మద్యపాన నిషేధంపై బటన్ ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. జగన్ బటన్ నొక్కుడుతో 7 సార్లు విద్యుత్ ఛార్జీలు,3సార్లు ఆర్టీసీ చార్జీలు పెరిగాయని విమర్శించారు. జగన్ ముందు కాళ్లు పట్టుకుంటారని,ఆ తర్వాత కాళ్లు లాగేస్తారని తన అవసరం కోసం ఏదైనా చేసే వ్యక్తి జగన్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బాగుపడింది జగన్ మాత్రమే అన్నారు. ప్రజల్లో జగన్ పాలనపై కసి కనిపిస్తోందని,ఆయనను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 50 రోజులలో రాష్ట్రంలో టిడిపి, జనసేన సునామీ రానుందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా బడేటి చంటి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని నాయకులు కార్యకర్తలు ప్రతినబూనారు.

### రూ.2.5 లక్షల విలువైన

## అక్రమ మద్యం పట్టివేత



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** మండలంలో లంకలకోడేరు కాపవరంమధ్యలో రొయ్యల చెరువుల వద్ద ఒక గొడౌన్లో తెలంగాణ మద్యం భారీగా పట్టివేత, వివరాల్లోకెళితే పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ, స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో ఏటి వి రవికుమార్ వారి ఆదేశాలు మేరకు, ఇంటిలిజెన్స్‌కు వచ్చిన సమాచారం మేరకు అంగర అప్పల నరసయ్య, అంగర సుబ్బారావు ఇరువురు తెలంగాణ నుంచి ఖరీదైన మందు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు ఎస్బిబి పోలీసులకు సమాచారం అందింది, సుమారు వీటి విలువ రూ.2లక్షల52 వేల 70 ఉంటుందని, 72 బీరు సీసాలు, నూటపది ఖరీదైన బ్రాండ్లు బాటిల్స్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

### స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కిరణ్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రుస్తుంబాధ మేరకగుడెంకు చెందిన గుడాల రవి కుమారుడు గుడాల సాయికిరణ్ కుమార్ (20)స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.శనివారంకాలేజ్ బీటెక్ 1 మొదటి సం విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ జరిగింది.అందులో పాల్గొన్న అనంతరం రాత్రి సమయంలో రైల్వేస్టేషన్ సమీపాన రైలు క్రిందపడి బలవన్మరణం చేసుకొన్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీస్ భీమవరం జిఆర్ పిఎస్ఎస్ ఐపిటి వి రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్నిప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### 24న ఎస్ఆర్‌కేఆర్‌లో సంకేత-2కే 24 జాతీయస్థాయి సింపోజియం



**భీమవరం,మేజర్‌న్యూస్ :** భీమవరం ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన సంకేత 2కె 24 పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళి కృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి.రామకృష్ణ నిశాంత్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ ఇటీవల అన్ని రంగాల్లోని విరివిగా ఉపయోగిస్తున్న డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్ కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు కార్యక్రమంలో కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ పి.రామమూర్తి రాజు,డాక్టర్ ఎస్ రాజేష్, ఇందుకూరి పవన్ కుమార్ వర్మ, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై అవగాహన కల్పించిన ఇన్నర్ వీల్ లయన్స్ క్లబ్



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** క్యాన్సర్ పై అవగాహన చెందితే ఎటువంటి వ్యాధినైనా జయించవచ్చని ఇన్నర్ వీల్ లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలూరు అధ్యక్షురాలు పిఎస్ లక్ష్మి అన్నారు. క్యాన్సర్ అవగాహన పై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు బహుమతులు అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీ మాట్లాడుతూ సుజుకి షోరూం అధినేత ఎన్ హెూటల్ నిర్వాహకులైన నారాశేషు సహాయ సహకారాలతో అవగాహన సదస్సు నిర్వహించామని తెలిపారు. క్లబ్బు సెక్రటరీ జి అచ్చిత మాట్లాడుతూ మహిళలకు క్యాన్సర్ పై అవగాహన కల్పించామని ప్రతి ఒక్కరూ అవగాహన చెంది ఎటువంటి సమస్య అయినా నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు సిఆర్ రెడ్డి కాలేజీకి చెందిన అండర్ 15 క్రికెట్ టీంలో రాష్ట్రానికి ఎంపికైన మా ఊరి మౌనిక అనే బాలికకు క్రికెట్ కిట్టు బహుమతిగా అందించారు.

## రాష్ట్ర క్రికెట్ టీంకు ఎంపికైన మోక్షితకు రూ.25 వేలు



**– వితరణ చూపిన జనసేన నాయకులు నారా శేషు**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరులో సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న మావూరి మోక్షిత అండర్ 15 బాలికల క్రికెట్ స్టేట్ టీముకు సెలెక్ట్ అయిన శుభ సందర్భంలో ఏలూరు జనసేన నాయకులు నారా శేషు మోక్షితకు 25వేల రూపాయల ప్రోత్సాహక నగదు అందజేశారు. భవిష్యత్తులో విద్యార్థులు కూడా వారిలో ఉన్న టాలెంట్ అనుగుణంగా అడుగులు వేసి ఎదిగి తద్వారా తల్లిదండ్రులకు, గురువులకు, నగరానికి, దేశానికి మంచి పేరు తేవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటునాన్నరు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ కార్యవర్గసభ్యులు,కేంద్ర పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు,జనసేన ప.గో జిల్లా ఉపాధ్యక్షులు ఈల్ల శ్రీనివాస్ ,నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# వైసిపి పాలనతోనే పేదల బ్రతుకులకు భరోసా

**వైసిపి యువజన విభాగం అధ్యక్షులు చంద్రశేఖర్**



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్:** రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పేదల ప్రభుత్వంగా గుర్తింపు పొందిన వైసీపీని ఓడించాలని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని, వారి ఆశలు నిరాసే అవుతాయని వైయస్సార్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షులు చినమిల్లి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారంమండలంలోని సీతారాంపురం లోఆయన నివాసంలో సూర్య ప్రతినిధితో మాట్లాడారు.దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనటువంటి పేదలకు ఉపయోగపడే ఎన్నో పథకాలను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. వైసిపి పాలన అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేదల జీవితాల్లో వెలుగు వచ్చిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న సభలకు వస్తున్న జనాదరణ ఏ ప్రభుత్వానికి రాలేదని ఆయన అన్నారు. పేదల బ్రతుకులకు భరోసా కావాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపి ప్రభుత్వం రావాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి సభలకుప్రజలు హాజరు చూసి ప్రతిపక్షాలు ఓ ర్వలేకపోతున్నాయని చంద్రశేఖర్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను రాబోయే ఎన్నికలలో వైసిపి పార్టీ కైవసం చేసుకుంటుందని చంద్రశేఖర్ దీ మా వ్యక్తం చేశారు. సిద్ధం సభలు జన సముద్రాన్ని తలపిస్తున్నాయని, మునుపన్నడు ఇంత జనం హాజరైన సభలు జరగలేదనిఅన్నారు. పేదల బ్రతుకులను మార్చే ఎన్నో పథకాలు ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నిన జగన్మోహన్ రెడ్డికి ఓటు వేసేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. నర్సాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు నాయకత్వంలో చురుగ్గా సాగుతున్నాయని ఆయన అన్నారు.ఈ నియోజకవర్గంలో జరుగుతున్న అనేక పనులపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, మనుగడ కాపాడుకునేందుకే వారు అలా చేస్తున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చంద్రశేఖర్ అన్నారు.

## రాష్టానికి రాజధాని లేదు యువతకు ఉపాధి లేదు

**ఆగడాల లంకలో మాజీఎమ్మెల్యే 'గన్ని' ఎన్నికల ప్రచారం**



**భీమడోలు, మేజర్ న్యూస్ :** జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రానికి రాజధాని లేదని, యువతకు భవిష్యత్తు లేదని టీడీపీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు మండలం కొల్లేరు గ్రామం ఆగడాలలంకలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన కూటమికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

## శిల్పా స్కానింగ్ సెంటర్ ప్రారంభం




**భీమవరం, మేజర్‌న్యూస్:** భీమవరం ప్రజలకు అత్యాధునిక వైద్య పరికరాలతో జేపీ రోడ్ లోని నూతనగా ఆధునికరించిన భవనంలో శిల్పా స్కానింగ్ సెంటర్, ఫెటల్ అండ్ ఉమెన్స్ ఇమేజింగ్ వింగ్ ను ఆదివారం కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ చేగొండి హరి రామ జోగయ్య, ఉపాధ్యక్షులు మల్లినీడి తిరుమలరావు, పట్నంలోని ప్రముఖ వైద్యుల సమక్షంలో డాక్టర్ సిహెచ్ వి సత్యనారాయణ రావు దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు, జనసేన పార్టీ ప్రోటోకాల్ చైర్మన్ మల్లినిడి తిరుమల రావు, పట్టణంలోని ప్రముఖ వైద్యులు ముదునూరి గోపాల కృష్ణంరాజు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా భీమవరం, పాలకొల్లులో ప్రజలకు ఎప్పటికప్పుడు అధునాతన పరికరాలను తీసుకువచ్చి అల్ట్రా సౌండ్ స్కానింగ్ లో డాక్టర్ సిహెచ్. వి. సత్యనారాయణ రావు అధునాతన సేవలు అందిస్తున్నారని ఆయనకున్న అపార అనుభవం పరిజ్ఞానంతో వచ్చే పేషెంట్స్ కు ఖచ్చితమైన రిపోర్ట్ అందిస్తారని తెలిపారు.

## 20న గుంటూరులో జరిగే వికలాంగుల పోరాట సమితి సభ జయప్రదం చేయండి



**భీమడోలు,మేజర్‌న్యూస్:** గుంటూరులో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశం జయప్రదం చేయాలని దివ్యాంగ హక్కుల పోరాట సమితి జిల్లాఅధ్యక్షులు మామిడిపల్లి నాగభూషణం కోరారు. ఈనెల 20వ తారీఖున గుంటూరులో జరిగే వికలాంగుల పోరాట సమితి సభకు ముఖ్య అతిథులుగా మందకృష్ణ మాదిగ హాజరవుతారనీ. ఈ సమావేశంలో మనకు ప్రభుత్వం ద్వారా వచ్చే ఉద్యోగాలు, వివాహం చేసుకొన్న జంటలకు రెండు లక్షలు ఆర్థిక సాయం , పెన్షన్ నిమిత్తం 6000 రూపాయలు వివిధ 21 కి పైగా అంశాలను చర్చిస్తారని నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షురాలు సుజాత, రాష్ట్ర అధ్యక్షులు సుబ్బయ్య యాదవ్, ముఖ్య నాయకులు ఈ పోరాటంలో ఏలూరు నుండి వికలాంగుల సోదర సోదరీమణులు పాల్గొనాలని కోరారు.

## దగాపడ్డ దళితుడా రా కదిలి రా సభకు 100 మంది యువకులు



**తాడేపల్లిగూడెం/పెంటపాడు, మేజర్ న్యూస్‌బీ** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపల్లె రాజేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న దగాపడ్డ దళితుడా రా కదలిరా సభకు తాడేపల్లిగూడెం నుండి సుమారు వందమంది దళితులు తరలి వెళ్లారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయాలనే సంకల్పంతో జరుగుతున్న ఈ సభకు తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి నేతృత్వంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముప్పిడి రమేష్ ఆధ్వర్యంలో నిడదవోలు సభకు తరలి వెళ్లారు. ఈ క్రమంలో రాజేష్ దళితులకు దిశా నిర్దేశం చేయనున్నారని ప్రస్తుత అధికార పార్టీ వల్ల దళితులకు జరిగిన అన్యాయాన్ని రాబోయే కాలంలో దళితులు తీసుకోవలసిన కార్యాచరణను తెలియజేసే అవకాశం ఉందని ముప్పిడి రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# మోడీని ఇంటికి పంపించాలి

**– మాజీ ఎమ్మెల్సీ,సిపిఐ రాష్ట్ర నేత జల్లి విల్సన్**




**భీమవరం,మేజర్‌న్యూస్ :** మళ్లీ మోడీ అధికారంలోకి వస్తే దేశంలో రాజ్యాంగం కనిపించదని, వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతాయని,దేశం ప్రమాదంలోకి వెళ్లిపోతుందని, నియంత పాలన సాగుతుందని, మోడీని ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో పెన్మత్స రామకృష్ణంరాజు సభావేదికపై ఎస్టీయు రాష్ట్ర అద్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఎస్టీయు 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో జల్లి విల్సన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ మేకవన్నె పులని, దేశంలో లౌకిక వ్యవస్థను తుంగలోకి తొక్కి కులాలు,మతం, ప్రాంతాల మధ్య చిచ్చురేపాడని నిప్పులు చెరిగారు. దేవుళ్ల పేరుతో మళ్లీ అధికారంలోకి రావడానికి కుయుక్తులు పన్నుతున్నాడని,రామ మందిరం పేరుతో న్యాయ వ్యవస్థలోకి చొరబడ్డాడని, రామమందిరంపై తీర్పు ఇచ్చిన వ్యక్తిని రాజ్యసభకు వెళ్లారని మోడీ తీరును ఆయన తూర్పారబట్టారు. ఎస్టీయు రాష్ట్ర అద్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న తమ నివేదికలను సభలో ప్రవేశపెట్టి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించడానికి తగు చర్యలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, తెలంగాణ ఎస్టీయు ప్రధాన కార్యదర్శి సదానంద గౌడ్, ఎస్టీయు రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్ తదితరులు మాట్లాడారు. గంట మోహన్, ఎం.వి.ఎస్.ఎన్.ప్రసాద్, వై.సుబ్రహమణ్యంరాజు, ఎస్.రామాంజనేయులు, ఎర్రయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించిన ముదునూరి



**మొగల్తూరు, మేజర్ న్యూస్:** మండలంలో కాళీపట్నంలో రూ 12 కోట్ల నిధులతో చేపడుతున్న సిమెంటు రోడ్డు పనులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో అన్ని రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే కాళీపట్నం వంతెన నిర్మాణం పూర్తి అయ్యిందని ఆయన అన్నారు.కాళీపట్నం – పాతపాడు సీసీ రహదారి నిర్మాణం సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ప్రసాద్ రాజు అన్నారు.పనులను మరింత వేగవంతం పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రసాదరాజు అన్నారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# రోడ్డు నిర్మించారు.. మార్జిన్ మరిచారు..



**బుట్టాయిగూడెం మేజర్‌న్యూస్ :** రోడ్డు నిర్మించారు కానీ మార్జిన్ వేయడం మరిచారు. గ్రామాల్లోని సిసి రోడ్లు నిర్మిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మార్జిన్ వేయడం వేయడం లేదు. మండలంలోని మర్లగూడెం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డుకి ఇరువైపులా మార్జిన్ వేయకుండ వదిలేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో జైనవారి గూడెం పంచాయతీకి రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. అందులోని మర్లగూడెం కాలనీ సీసీ రోడ్డుకి రూ.5 లక్షలు కేటాయించారు. రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు అసంపూర్తిగా ఉంది.గ్రామస్తులు రాకపోకలు సాగించే టప్పుడు వాహనాలన్న తప్పుకోవాలన్న తీవ్ర ఇబ్బందులకు గురికా వలసి వస్తుంది. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయి రెండు నెలలు గడుస్తు న్నా కాంట్రాక్టర్ మార్జిన్ వేయకుండా కనీసం పట్టించుకోక పోవడంతో స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో ఇరువైపుల మట్టి పోయవలసి ఉండగా నెలలు తరబడిన పోయటం లేదు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపం కనిపిస్తుందని పలువురు ఆరోపిస్తు న్నారు. కాంట్రాక్టర్‌కి బిల్లులు తీసుకోవడం తెలుసు కానీ పూర్తిస్థాయిలో పనులు చేయడం తెలియదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా మార్జిన్‌లు వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యార్థి దశ నుండే వైజ్ఞానిక ప్రదర్శనలు చేయాలి

**మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ**



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం మండలం ఎల్ అగ్రహారం లోని సూర్య శ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని వాటిపై అవగాహన కలిగి ఉంటే వారే రేపటి శాస్త్రవేత్తలు అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యశ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రెటరీ కరస్పాండెంట్ వెలగల సూర్యనారాయణ రెడ్డి, రెడ్డి సంఘ అధ్యక్షులు ద్వారంపూడి వేణు గోపాల్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ బీఈడీ కళాశాల అధ్యక్షులు మేడపాటి విజయరెడ్డి, బిజెపి నాయకురాలు పడాల కావ్య రెడ్డి, పాఠశాల చైర్మన్ వెలగల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలు

**పోలవరం నియోజకవర్గ కన్వీనర్ 'బొరగం'**



**బుట్టాయగూడెం,మేజర్ న్యూస్:** ప్రభుత్వానికి కౌన్ డౌన్ మొదలైందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కోయ అంకంపాలెం గ్రామంలో బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.


ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోలవరం నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం, జనసేన కూటమి అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో పల్లోతు నాగబాబు,మండల పార్టీ ఉపాధ్యక్షులు కేరం వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా తెలుగురైతు కార్యదర్శి గద్దె అబ్బులు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మడకం రామకృష్ణ, ఎస్టీ సెల్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరరావు, తెల్లం రామారావు, సవలం రాము తదితరులు ఉన్నారు.

## 28,29 డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు నగర అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం 28,29 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు ఏలూరు శాసన సభ్యులు ఆళ్ల నాని శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు,డీప్యూటీ మేయర్ ఎన్ సుధీర్ బాబు,మున్సిపల్ కమిష్నర్ వెంకట కృష్ణ,మాజీ ఎఎంసి చైర్మన్ మంచెం మైబాబు తదితరు పాల్గొన్నారు.

## షర్మిల నాయకత్వాన్ని బలపరచండి




**యలమంచిలి, మేజర్ న్యూస్:** యలమంచిలి మండలంలో గుంపర్రు, కంబట్లపాలెం, చింత దెబ్బ, అబ్బిరాజుపాలెంలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. పాలకొల్లు సమన్వయకర్త కొలుకులూరి అర్జున్ రావు ప్రజలను కలిసి అభివాదం చేస్తూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని బడుగు బలహీన వర్గాలకు కొండ అంత అండ అన్నారు, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైయస్ షర్మిల పార్టీని తన భుజాన వేసుకుని బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలని సంకల్పంతో ఆంధ్రాలో అడుగు పెట్టారని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రావు, ఎం గోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ చేపల చెరువులు త్రవ్వకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్

**– కొల్లేరు 5వ కాంటూరు పరిధిలో 52 మందితో బృందాలు**

**– వన్యప్రాణుల విభాగం డివిజనల్ అటవీ శాఖ అధికారిణి యం.హిమ శైలజ**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** కొల్లేరు అభయారణ్యం 5వ కాంటూరు పరిధిలో ఎక్కడ అక్రమ చేపల చెరువులు త్రవ్వకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వన్యప్రాణుల విభాగం డివిజనల్ అటవీ శాఖ అధికారిణి యం.హిమ శైలజ తెలిపారు. పైడిచింతపాడు,మల్లవరం, బొబ్బిలిలంక గ్రామాలలో పర్యటించడం జరిగిందన్నారు. కొల్లేరు 5వ కాంటూరు పరిధిలో ఎటువంటి అక్రమ చేపల చెరువుల త్రవ్వకాలు జరపకుండా పటిష్టమైన నిరోధక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఇప్పటికే అటవీశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. కొల్లేరు అభ అరణ్యం పరిధిలో అక్రమ చేపల చెరువు త్రవ్వకాలు జరుగుతున్నాయని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో కొల్లేరు అభ అరణ్య పరిరక్షణ కొరకు రాజమండ్రి ముఖ్య అటవీ సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు డివిజనల్ అటవీశాఖ అధికారి వన్యప్రాణుల విభాగం అధ్యక్షతన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ నియమించడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి రాజమండ్రి సర్కిల్ పరిధిలోని అటవీశాఖ అధికారులను, సిబ్బందిని ఏలూరు వన్యప్రాణుల విభాగం కార్యాలయంలో సమావేశపరిచి వారికి అభయారణ్యం పరిరక్షణపై తగు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.సుమారు 52 మంది అటవీ శాఖ అధికారులు,సిబ్బంది కలిసి కొల్లేరు అభయారణ్యంలో ప్రభుత్వ భూములలో చెరువులు తవ్వకాలు జరగకుండా తనిఖీ చేయడం జరిగిందన్నారు.పైడిచింతపాడు,మల్లవరం,బొబ్బిలిలంక గ్రామాలలో పర్యవేక్షించడం జరిగిందన్నారు. కొల్లేరు 5వ కాంటూరు పరిధిలో ఎటువంటి అక్రమ చేపల చెరువులు త్రవ్వకాలు జరపరాదని అట్లు జరిపిన వారిపై వన్యప్రాణి చట్టం 1972 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.

## అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి

**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం ఆ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు జ్యోతి (68) భర్త కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తుంది. భర్త ప్రభుత్వ ఉద్యోగి కావడంతో పింఛన్ ఆధారంగా జీవనం సాగిస్తుంది.

రెండు రోజులుగా వృద్ధురాలు ఇంటి నుండి బయటకు రాకపోవడం,ఆ ఇంటి నుండి దుర్వాసన రావడంతో అనుమానంతో పొరుగువారుఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా వృద్ధురాలు మృతి చెందినట్లు గుర్తించారు. వృద్ధురాలు మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు మృతికి సంబంధించిన వివరాలు తెలియవలసి ఉందని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.